క్లుప్తంగా

క్విజ్ పోటీలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాయలసీమ జోనల్ సీఎంఈ పీటల్ మెడిసిన్ క్విజ్ పోటీలను ఫాతిమా మెడికల్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జోన్ నుంచి వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు ఎం.మన్యతారెడ్డి రెండవ బహుమతిని, కె.సుదీప్ వాస్ మూడవ బహుమతిని గెలుచుకున్నారు. వీరికి మంగళవారం కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రేడియాలజీ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో బీజేపీ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : భారతీయ జనతా పార్టీలో వంద కుటుంబాలు చేరినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణరెడ్డి తెలిపారు. మంగళవారం కడప నగరంలోని రెండవ డివిజన్ వైఎస్సార్ కాలనీలో స్థానికుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీలో చేరిన వారికి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పుప్పాల శ్రీనాథరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బత్తల పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, నాయకులు అమర్‌నాథరెడ్డి, సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మినరసయ్య, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

నివాళి



గంగిరెడ్డికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంగిరెడ్డి మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున్‌రెడ్డి, భైరవ ట్రాన్స్‌పోర్టు అధినేత మహేంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వీరయ్యయాదవ్ తదితరులు గంగిరెడ్డికి నివాళి అర్పించారు.

గోడ కూలడంతోనే టవర్ పడిపోయింది



పడిపోయిన విద్యుత్ టవర్

పులివెందుల రూరల్ : పట్టణంలోని గరండాల్ వంక సమీపంలో ఉన్న విద్యుత్ టవర్ చాలా కాలం క్రితం నిర్మించిన గోడ కూలడంతోనే పడిపోయిందని ఏడీ శ్రీకాంత్ తెలిపారు. ఏడాది క్రితం నుంచి టవర్ పనులు జరుగుతున్నాయని, పనులన్ని పాడా నిధుల ద్వారా ఆర్అండ్‌బీ, విద్యుత్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయన్నారు. విద్యుత్‌శాఖ నుంచి నేరుగా ఎటువంటి బిల్లులు చెల్లింపులు జరుగవన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల మాత్రమే టవర్ పడిపోయిందని ఇందులో ఎటువంటి నాసిరకం పనులు చేయలేదని ఆయన అన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

కమలాపురం : పట్టణ పరిధిలోని శ్రీ షిరిడి సాయి రైస్ మిల్ అధినేత మీగడ రామసుబ్బారెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జడ్పీ బాలికల హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం సరస్వతి తెలిపారు. మంగళవారం ఆయన తన కుమార్తె మీగడ సాయితేజ 14వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అంధుల కాలనీకి చెందిన జయన్న, కళావతి, అప్పాయపల్లెకు చెందిన వికలాంగురాలు సుజనమ్మలకు రూ.10వేల చొప్పున మొత్తం రూ.30వేల నగదును ఉపాధ్యాయులు, విద్యార్థుల చేతుల మీదుగా అందజేశారు. అలాగే పాఠశాలకు చెందిన 100 మంది విద్యార్థినులకు వైట్ అండ్ వైట్ యూనిఫామ్ అందజేశారు. ప్రతి ఏటా రామసుబ్బారెడ్డి తన కుమార్తె జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికల హైస్కూల్‌కు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేయడం హర్షణీయం అన్నారు. అలాగే వారికి అవసరమైన ప్లేట్లు, గ్లాసులు తదితరవి పంపిణీ చేసేవారన్నారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా వన్‌స్టాప్ సెంటర్

సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్



రికార్డులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆపదలో ఉన్న మహిళలు వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించి అక్కడ అందే సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ తెలిపారు. మంగళవారం స్థానిక రిమ్స్ ఆవరణలోని వన్‌స్టాప్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. రిజిష్టర్లను పరిశీలించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే చోట అనేక సేవలు లభిస్తున్నాయన్నారు. వన్‌స్టాప్ సెంటర్లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీసు సహాయం, మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు అందుతున్నాయన్నారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, వరకట్న మరణాలు వంటి సందర్భాలలో మహిళలకు అండగా ఉంటారన్నారు. అనంతరం ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. గౌరవ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ నేషనల్ టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ 15100, మహిళలకు 181, ఉమెన్ హెల్ప్ లైన్, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 100 పోలీస్ హెల్ప్ లైన్ తదితర టోల్ ఫ్రీ నెంబర్ లపై అవగాహన కల్పించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలి



ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని యూటీఎఫ్ నాయకులు కోరారు. మంగళవారం కడపలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఆయనను వారు కలిసి విద్యారంగ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు యాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్న జీవో 117ను రద్దు చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. 1 నుంచి 5వ తరగతులను ప్రాథమిక విద్యలో, 6 నుంచి 12 తరగతులను సెకండరీ స్థాయి విద్య పరిధిలో నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మాధ్యమానికి సమాంతరంగా తెలుగ మాధ్యమాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ సహాధ్యక్షులు రవికుమార్, సుజాతరాణి, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు రమణ, శ్రీనివాసులు, ఎజాస్ అహమ్మద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూతు ఆరోగ్యమేరీ, నాయకులు అనిల్, లక్ష్మిదేవమ్మ, బాషా తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గోశాలను తనిఖీ చేసిన కమిషనర్



పారిశుధ్య కార్మికుల పనితీరును పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : చింతకొమ్మదిన్నె మండలంలోని గోశాలలో పని చేస్తున్న వర్కర్లకు సబ్బులు, కొబ్బరినూనె సరఫరా చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఆదేశించారు. మంగళవారం ఆయన గోశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోశాల రికార్డులను పరిశీలించారు. ఆవు పేడను కుళ్లబెట్టి వానపాములను ఉత్పత్తి చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. గోశాల వద్ద సూపర్ నేపియర్ గ్రాస్ ఏర్పాటు పరిశీలించి, ఖాళీ ప్రదేశాల్లో కూడా అలాంటి గడ్డిని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. గోశాల వద్ద పాండ్ ఏర్పాటు చేయాలన్నారు. 17వ డివిజన్ కొత్త కాలనీ వద్ద రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించాలని సూచించారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. కార్మికులు నూతనంగా ఇచ్చిన యూనిఫామ్ ధరించాలన్నారు. జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాల ముందు కాలువ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని డివిజన్లోని కాలువల్లో స్ప్రే చేయాలన్నారు. అనంతరం ప్రకృతి వనంలోని మొక్కలు, చెట్లను పరిశీలించారు. నర్సరీ ఏర్పాటు చేయుటకు చర్యలు చేపట్టాలన్నారు.

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై నిరసన



అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగళ శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ నిన్న పార్లమెంటులో రాహుల్ గాంధీ హిందూ సమాజాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని, కావున ఆయన క్షమాపణ చెప్పాలని అన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ యువజన విభాగం, భారతీయ జనతా యువ మోర్చా తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మున విజయ్, రాష్ట్ర నాయకులు బత్తల పవన్ కుమార్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చలపతి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ నాయుడు, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న అర్చకులు, సిబ్బంది

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరాలయంలో మంగళవారం స్వామివారి హుండీని లెక్కించారు. అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి వద్ద గల హుండీలను లెక్కించగా మూడు నెలల 15 రోజులకు గాను రూ.1,50,439లను భక్తులు స్వామివారికి కానుకల రూపంలో సమర్పించారు. అలాగే గోశాలలోని హుండీ లెక్కించగా రూ.20,897 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, దేవాదాయ శాఖ జ్యువెలరి వెరిఫికేషన్ ఆఫీసర్ పాండురంగారెడ్డి, ఏసీ శంకరబాలాజి, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు. కాగా మంగళవారం మధ్యాహ్నం జరుగవలసిన ఆలయానికి సంబంధించిన 15 గదుల వేలం వాయిదా వేసినట్లు ఏసీ శంకర బాలాజీ తెలిపారు.

రేపు శివపార్వతుల కల్యాణం

స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం మాస శివరాత్రి పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరిలకు విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు, సాయంత్రం 6 గంటలకు గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామని వివరించారు. అలాగే శుక్రవారం ఆరుద్ర నక్షత్ర అమావాస్య సందర్భంగా ఉదయం 7 గంటలకు మృత్యుంజయ హోమం, సాయంత్రం అగస్త్యేశ్వరునికి భస్మహారతి, భస్మార్చన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

వ్యాసరచన పోటీలు

కడప ఎడ్యుకేషన్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వాత్మ పిడిమిడ్ యోగా ధ్యాన కేంద్రం వారు మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యామందిర్ పాఠశాలకు చెందిన 8వ తగరతి విద్యార్థి ప్రియవదన ప్రథమ, 10వ తరగతి విద్యార్థి శ్రీశైల, 9వ తరగతి విద్యార్థి శ్రీజ ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు విశ్వాత్మ పిరమిడ్ యోగా ధ్యాన వ్యవస్థాపకులు ఆచార్యులు, యోగా గురువు జీవీ శేషారెడ్డి, ఊర్మిళ తెలిపారు. త్వరలోనే విజేతలకు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలను అందజేస్తామని వారు తెలిపారు.

రేపు వడ్డెర్ల ఆత్మీయ సభ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా వడ్డెర్ల ఆత్మీయ సన్మాన సభ గురువారం సాయంత్రం 4 గంటలకు కడప నగరంలోని ఐఎంఏ హాలులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, చంద్రగిరి నారాయణ తెలిపారు. ఈ ఆత్మీయ సభకు కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, టీడీపీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి హాజరవుతారన్నారు. జిల్లాలోని వడ్డెర కులస్తులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

గండి శ్రావణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శ్రావణ మాస మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం వేంపల్లె ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయనను ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ఆలయ ప్రధాన అర్చకులు కేసరిస్వామిలు మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆగస్టులో గండి ఆలయంలో జరిగే శ్రావణ మాస ఉత్సవాలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. టీటీడీ వారితో మాట్లాడి భక్తుల సౌకర్యం కోసం జర్మన్ షెడ్డు వేయించేలా చూస్తామన్నారు.

పాఠశాలల్లో తాగునీటి సమస్య ఉండకూడదు

చెన్నూరు : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తాగునీటి సమస్య ఉండకూడదని డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యలయంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని పాఠశాలల్లో ఎన్ని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్ లు ఉన్నాయి, అలాగే ఏపీ పాఠశాలలో (ట్యాప్ వాటర్) ఉన్నాయి, వాటి పర్యవేక్షణ, ఇబ్బందుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు గల పాఠశాలలో నెలలో ప్రతి మొదటి, నాలుగవ వారం ఆయా ట్యాంకులను శుభ్రపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి ప్రధానోపాధ్యాయుడు పద్మనాభంకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి-2 సునీత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం సుబ్రహ్మణ్యస్వామికి మండలపూజా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి, ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

చదువులో పోటీతత్వం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న ఎన్ఆర్ఐ నాగశేఖర్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : ప్రతి విద్యార్థి చదువులో పోటీతత్వం అలవాటు చేసుకోవాలని ఎన్ఆర్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్.పాలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా సోదరుడు గోర్ల శ్రీకాంత్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం గ్రామంలోని పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు పొందిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేలె నగదు బహుమతిని గత 9 సంవత్సరాల నుంచి అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలోని 120 మంది విద్యార్థులకు డిక్షనరీలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

4న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలో నీట్ పరీక్ష ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు డీవైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. మంగళవారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో ఇప్పటికే 65 సార్లు పేపర్లు లీకులు అయ్యాయన్నారు. కావున లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన తీరును నిరసిస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఈ నెల 4న దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి అంజి పాల్గొన్నారు.

ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 4న జరిగే విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శివశంకర్, ఆనంద్, మస్తాన్, అశోక్, సల్మాన్ పాల్గొన్నారు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి



మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ ఆర్టీఐ రాష్ట్ర చైర్మన్ కె.లక్షుమయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ లాగా మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేయాలని యువజన కాంగ్రెస్ ఆర్టీఐ రాష్ట్ర చైర్మన్ కోటపాటి లక్షుమయ్య పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌కి హోదాపై చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కనీసం నోరు విప్పడం లేదన్నారు. ఎందుకు మౌనం వహిస్తున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందిమండలం విజయ్ సుశీల్ కుమార్, యువజన కాంగ్రెస్ ఆర్టీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ అమీర్ బాషా, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, యువజన కాంగ్రెస్ అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు నందిమండలం వెంకటసుబ్బయ్య, యువజన కాంగ్రెస్ ఆర్టీఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ నరసింహులు, యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షులు దాసరి శివశంకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనురు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల అరియర్స్ వీడియే ఇన్సెంటివ్ ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలో 20 ఏళ్లుగా పని చేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు సంబంధించి ఒకరికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. తమ సమస్యలపై చర్చించడానికి ఈ నెల 7న విజయవాడలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులు, జిల్లా కోశాధికారి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వికాస్, కేశవ రెడ్డి పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని అఖిల భారతీయ విద్యార్థి సంఘం(ఏబీవీపీ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లికార్జున ఆరోపించారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ మర్రెడ్డి అనురాధకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు పాఠశాలల్లో తమ పాఠశాల పేర్లతో మెటీరియల్‌ను ముద్రించి మార్కెట్ ధరల కంటే అధిక రేట్లతో అమ్ముతున్నారన్నారు. పాఠశాలలను వ్యాపార కేంద్రంగా మారుస్తూ తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. ఈ విషయాలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రవర్, వచర్, వంశీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

సమరయోధుని భూమి అప్పగించాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్ణ నాగయ్య భూమిని కొందరు కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఆ భూమిని తిరిగి సమరయోధుని కుటుంబ సభ్యులకు అప్పగించాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సదర్భంగా జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ నాయకుడు అవ్వారు మల్లికార్జున, కె.ఆంజనేయులు, ఏపీ దళిత మిత్ర రాష్ట్ర అధ్యక్షులు కె.రామాంజనేయులు, డీఎం ఓబులేశులు మాట్లాడుతూ కబ్జాదారుల పేరిట అక్రమంగా రిజిస్టర్ చేసిన అధికారులను సస్పెండ్ చేసి విచారణ చేపట్టాలని కోరారు.

ఉర్దూ పాఠ్యపుస్తకాలు సరఫరా చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆంధ్ర రాష్ట్రంలో రెండో అధికార భాషగా ఉర్దూ అమల్లో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు నేటికీ అందించకపోవడం బాధాకరమని ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా పేర్కొన్నారు. మంగళవారం ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉర్దూ పాఠశాలలు పునః ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఉర్దూ మాధ్యమం పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందలేదన్నారు. గత సంవత్సరం 9, 10వ తరగతి పాఠ్యపుస్తకాలు మారిపోయాయని, ఇప్పటికీ ప్రథమ భాష ఉర్దూకు సంబంధించిన పాత ఉర్దూ పాఠ్యపుస్తకాలను సరఫరా చేస్తున్నారన్నారు. మిగిలిన అన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలను కొత్తగా తయారు చేసినారు కానీ, ప్రథమ భాష ఉర్దూ పాఠ్య పుస్తకాల్ని తయారు చేయకుండా ఎందుకు పక్కన పెట్టారో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్ర విద్యాశాఖ వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుని, ఉర్దూ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

శ్లాబ్ పెచ్చులూడి నలుగురికి గాయాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మంగళవారం తరగతి గదిలో శ్లాబ్ పైకప్పు పెచ్చులూడి విద్యార్థులపై పండింది. ఈ ఘటనలో నలుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. వీరిలో ఒక బాలుడికి మూడు కుట్లు పడగా మిగత వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే పాఠశాల యాజమాన్యం బాధితులను ఆసుపత్రికి తరలించి వైద్య సేవలందించారు. అయితే విద్యార్థి సంఘాలు పాఠశాల ఎదట ఆందోళన చేసి, పాఠశాల గుర్తింపు రద్దు చేయడంతోపాటు యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పాఠశాల కరస్పాండెంట్‌ను వివరణ కోరగా తమ పాఠశాల శ్లాబ్ పై పెచ్చు కొద్దిగా ఊడి పిల్లలపై పడటం వాస్తవమేనని, అయితే తక్షణమే పిల్లలను ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించామన్నారు. కాకపోతే తాను వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తినని లేనిపోని రాజకీయం చేస్తున్నారన్నారు. విద్యాసంస్థలన్న తరువాత చిన్నచిన్న పొరపాట్లు జరగడం సహజమన్నారు. కాకపోతే రాజకీయ కక్షతో తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాజకీయాలు వేరని, విద్యాసంస్థల నిర్వాహణ వేరన్నారు. ఈ విషయంలో కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి సంబంధిత పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన విచారణ కోసం డీఈఓ త్రిమెన్ కమిటీని నియమించారు. ఆ కమిటీ విచారణ చేసి నివేదికలను సమర్పించిన తరువాత చర్యలు తీసుకుంటామని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. పాఠశాలను ఆర్డీఓ పరిశీలించారు.